# ప్లాన్

## - కోనే హరిబాబు

"ఫరవాలేదు! లోపలికి పద!" అంటూ గదిలోకి తీసుకెళ్ళాడు సురేంద్ర గోపాల్రావుని.

ఇద్దరూ లోపలకు నడిచారు.

గోపాల్రావు ఆ గది అలంకరణలు చూస్తున్నాడు. "డబ్బు గలవాళ్ళ బుద్ధులతోబాటు వాళ్ళ అభిరుచులుకూడా క్లాసుగానే వుంటాయి" అనుకున్నాడు. అక్కడున్న డెకొరేషన్స్ చూసి అది "ఒక్క మనిషి వుండే గది" అంటే మామూలు వ్యక్తులు నమ్మలేరేమో.

"ఎవరన్నయ్యా అది?" ఒక కోయిల కంఠం ప్రశ్నించింది విరసంగా.

అటు చూశాడు గోపాల్రావు. ఒక అందాల భరిణె బెడ్ మీద పడుకొని ఉంది. ఆమెకు సుమారు ఇరవై రెండు, ఇరవై మూడేళ్ళుంటాయి.

"నా డియరెస్టు ఫ్రెండు గోపాల్రావని, ఈ మధ్యనే మన ఊరికి ట్రాన్స్ఫరై వచ్చాడు... మీట్ మై సిస్టర్ మిస్ రేవతి" అన్నాడు వారిద్దరి మధ్య పరిచయం చేస్తూ సురేంద్ర.

"నమస్తే" అన్నాడు గోపాల్రావు ఆమె అందమైన మొహంవంక కన్నార్పకుండా చూస్తూ.

తిరిగి నమస్కారం చేస్తూ అతడివంక పరీక్షగా చూసింది రేవతి.

సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు ధృఢమైన ఛాతి, కండలు తిరిగిన శరీరం. కోటేరులాంటి ముక్కు - తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు, ఎర్రటి ఛాయ - మొత్తానికి ఆడవాళ్ళని సులభంగా ఆకర్షించే అతడి మూర్తి మీద నుండి తన కళ్ళను తిప్పుకోలేకపోయింది.

"వీడు మనింట్లోనే వుంటాడు ... ఏరా ఏమంటావ్....? సాయంత్రం నీ పెట్టె బేడా తీసుకొని వచ్చేయ్ .... సరేగాని చెల్లాయ్ వాడికి ఏ గది యిద్దామంటావు?" గబగబా మాట్లాడేశాడు సురేంద్ర.

"అదేమిటి? ఒక్క గది ఏం సరిపోతుంది? ఆయన మిసెస్ పిల్లలు ఎక్కడుంటారనుకున్నావు" పరిహాసంగా చూస్తూ అంది రేవతి.

"మైగాడ్ నాకింకా పెళ్ళికాలేదండి బాబూ" అన్నాడు గోపాల్రావు పెద్దగా నవ్వుతూ.

"ఐయామ్ సారీ!.... మీ ఉద్యోగం ఏమిటో చెబుతారా?" కుతూహలంగా చూసింది రేవతి.

"నేను....నేను... తాలూకాఫీసులో క్లర్కుని."

అతడి తడబాటుకు నవ్వొచ్చింది రేవతికి.

"నీ గది ఎదురుగా వున్న రూం వాడికిద్దామనుకొంటున్నాను. ఏమంటావు?"

అడిగాడు సురేంద్ర.

"అలాగే యిద్దాం.... సాయంత్రం వచ్చేయండి."

"ఓ కే. యిక నేను వెళ్తాను" అన్నాడు గోపాల్రావు అక్కడ నుండి కదుల్తూ

"అయ్యో! కాఫీకూడా తీసుకోకుండా వెళ్ళిపోతారా. కాఫీ తాగి వెళ్దురు గాని వుండండి." అంది రేవతి

"ఫరవాలేదు. రేపట్నుండి ఎలాగూ యిక్కడే వుంటాను గదా! మీ యిష్టమొచ్చినన్ని సార్లు యివ్వండి తాగేస్తాను" అన్నాడు గోపాల్రావు నవ్వుతూ.

ఆ మాటలకు రేవతికూడా నవ్వకుండా వుండలేక పోయింది.

"పదరా! నిన్ను హోటల్ దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు సురేంద్ర.

"మీ సిస్టర్ నా ఉద్యోగం గురించి అడిగినప్పుడు నిజం చెప్పేస్తావేమో నని భయం కలిగింది." అన్నాడు గోపాల్రావు యిద్దరూ బయటకు వచ్చిన తరువాత.

"డోన్టబి ఫూలిష్!... గో ఫార్వర్డ్" గంభీరంగా అన్నాడు సురేంద్ర.

●

"మే ఐ కమిన్"

"ఎస్ ... కమిన్"

గోపాల్రావు లోపలికి వచ్చి రేవతి బెడ్ దగ్గరున్న కుర్చీలో కూర్చుంటూ అడిగాడు-

"ఒంట్లో ఎలావుంది?"

"నాకేం? నేను ఎప్పట్లానే వున్నాను. మీరే చిక్కిపోయారు మా కుక్ వంట నచ్చటము లేదా? .... పాపిష్టిదాన్ని .... మీకు నా చేత్తో వండి పెట్టలేక పోతున్నాను" బాధగా అంది రేవతి.

"మన పెళ్ళయ్యాక వండి పెట్టుదువు గాని లే ...." కొంటెగా చూశాడు గోపాల్రావు

"ఈ కుంటదాన్ని చూస్తే వేళాకోళంగా వుందా మీకు? మీకు నేను తగను" కళ్ళు తుడుచుకుంటూ అంది రేవతి.

"మైస్వీట్ డార్లింగ్! ఎందుకలా బాధ పడ్తావు నీకు తప్పకుండా కాళ్ళు వస్తాయి.... మన పెళ్ళి జరుగుతుంది.

"అంతా అబద్ధం"

"నిజం, మన ప్రేమ మీద వట్టు మన విషయం మీ అన్నయ్యతో రేపే చెప్తాను" ఆమెవంక అదోలా చూస్తూ చెప్పాడు గోపాల్రావు

ఈ చివరి మాటలు రేవతిమీద మంత్రంలా పని చేశాయి వెంటనే బెడ్ మీదనుండి గబుక్కున దిగి, రెండడుగులు వేసి గోపాల్రావు చేతినందుకొని ముద్దు పెట్టుకొంది.

గోపాలరావు ఆశ్చర్యపోతూ ఆమె కాళ్ళ వంక చూశాడు పరీక్షగా తను రేవతి వాళ్ళింట్లో చేరి మూడెన్నెల్లయింది. ఈ మూడు నెలల్లోనూ ఒక్కసారి కూడా రేవతి నడవడం చూడలేదు.

ఆమాటే అన్నాడు ఆమెతో—

"రేవతీ, నువ్వు నడుస్తున్నావ్" దాదాపు అరచినంత గట్టిగా అన్నాడు గోపాల్రావు.

రేవతి కూడా ఆగిపోయి ఆశ్చర్యంగా తన కాళ్ళవంక చూసుకొని, అడుగు ముందుకు వేయబోయింది.

కానీ కాలు కదపలేకపోయింది. నుంచున్న వ్యక్తి నుంచున్నట్టే వుండిపోయింది.

హఠాత్తుగా దుఃఖం ముంచుకొచ్చిందామెకు.

"అవును రావుగారూ మీరు నన్ను పెళ్ళాడుతాననగానే వళ్ళు మరచిన ఆనందంతో నేనేం చేస్తున్నానో తెలియని స్థితిలో లేచి నడవగలిగాను. కానీ యిప్పుడు .... ఎందుకనో .... ఎందుకనో నడవలేక పోతున్నాను." డగ్గుత్తికగా అంది రేవతి.

గోపాల్రావు మెదడులో ఏదో ఆలోచన సుళ్ళు తిరుగుతోంది. వెంటనే కుర్చీలోంచి

లేచి రేవతిని రెండు చేతుల్తోటీ ఎత్తి బెడ్ మీద పడుకోబెట్టాడు

ఆమె మొహంలోకి పరీక్షగా చూసి—

"దయచేసి ఎక్కువగా ఆలోచించకుండా వెంటనే నిద్ర పోవడానికి ప్రయత్నించు. నేను మళ్ళీ ఉదయమే కనిపిస్తాను గుడ్ నైట్ విత్ స్వీట్ డ్రీమ్స్" లైట్ తీసేసి గబగబా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఏదో వస్తువు దబ్బున క్రిందపడ్డ శబ్దం. రేవతికి హఠాత్తుగా మెలకువ వచ్చింది.

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది.

బెడ్ లైట్ వెల్తుర్లో చుట్టూగల వస్తువులను స్పష్టంగా చూడటానికి రెండు నిమిషాలు పట్టింది రేవతికి.

పరీక్షగా నాలుగువైపులా చూసింది

ఇనప్పెట్టె దగ్గర ఎవరో వ్యక్తి నుంచొని దాన్ని తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు. రేవతి ఆ వైపు చూసేసరికి అతడు వంగి క్రింద పడున్న సుత్తిని అందుకుంటున్నాడు. అతడి వీపు రేవతివైపు వుండటం వల్ల మొహం గుర్తించడానికి వీల్లేకపోయింది.

హఠాత్తుగా ఆమెకు వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది అతడు ... అతడు.... దొంగతనానికి తన గదిలో దూరాడు" ఆ వూహ రావడం తోటే ఆమె శరీరం చెమటతో తడిసి పోయింది. గొంతు తడారిపోయి మాట పెగలడం లేదు.

ఎలాగో ధైర్యం తెచ్చుకొని, ప్రక్కనున్న టేబుల్ లైట్ స్విచ్ నొక్కుతూ "ఎవరక్కడ ? యినప్పెట్టెదగ్గర ?" అంది గొంతు పెగుల్చుకొని అతి కష్టం మీద.

హఠాత్తుగా కథ అడ్డం తిరగడంతో ఆ వ్యక్తి కంగారుగా రేవతి వైపు తిరిగాడు.

అతడి ముఖం స్పష్టంగా లైట్ వెల్తుర్లో చూస్తూనే ఉలిక్కి పడింది రేవతి.

అతడు గోపాల్రావు

అప్పటివరకూ భయంతో అల్లలాడిన ఆమెశరీరం. యిప్పుడుకోపంతో ఉద్రేకంతో ఊగిపోయింది. దుర్మార్గుడు మిత్రద్రోహి. కపట ప్రేమికుడు తనను ప్రేమిస్తున్నట్టు ఎంత నాటకం ఆడాడు ! దేముడి లాంటి అన్నయ్యను మోసగించి, యిటు వంటివాడితోనా నేను ప్రేమాయణం సాగించింది ?" అనే వూహ రావడంతోటే ఆమెకు వంటి మీద తేళ్ళు జెర్రులూ పాకినట్లయింది.

హఠాత్తుగా బెడ్ మీద నుండి దిగి తన వంకే తెల్లబోయి చూస్తున్న గోపాల్రావుని సమీపిస్తూ "స్టుపిడ్, పాలుపోసిన చేతినే కాటేద్దా మనుకున్నావన్నమాట ! .... నాతో ప్రేమ కలాపాలు సాగించి నన్ను వశపర్చేదామని ఆశించావు కదూ ! నీ పాపం బద్దలయింది. యివ్వేళతోనే నీ నిజరూపం బయట పడింది. నిన్ను .... నిన్ను .... ఉద్రేకం పట్టలేక అతడి చెంపలు రెండూ దబదబా వాయించేసింది. మళ్ళీ అంతలోనే తేరుకుంటూ," నీలాంటి పయోముఖ విష కుంభాలను ఊరికే వదల కూడదు నిన్ను పోలీసులకు పట్టించి ..." అంటూ అతడి కాలరు పట్టుకొని మెట్లవద్దకు పరుగెత్తింది రేవతి.

గబగబా మెట్లన్నీ దిగి ప్రక్కనున్న సురేంద్ర గదిలోకి వెళ్ళింది. అతడ్ని తట్టి లేపి గోపాల్రావుని అతడి చేతి కప్పగించింది విషయం రెండుముక్కల్లో వివరిస్తూ.

సురేంద్ర ఏదో చెప్పబోయాడు గోపాల్రావు అతడ్ని మాట్లాడ వద్దన్నట్లు సైగ చేశాడు.

ఈలోగా రేవతి ఫోన్ గదిలోకి పరుగెత్తి, ఇన్‌స్పెక్టర్‌కు విషయం వివరిస్తూ ఫోన్ చేసింది. ఇన్‌స్పెక్టర్ వెంటనే వస్తున్నానని చెప్పాడు ఫోన్‌లో.

## సాధ్యంకావడంలేదు

నేను ....
సామాన్యుణ్ణి
కొల్లెక్కలేను
మేడలు కట్టలేను

అలా అని
ఊరకే వుండగలనా ?

రవి సంటిన ధరల
సంటాలని యత్నిస్తున్నాను,

అది కూడా సాధ్యం
కావడం లేదు.

—గొట్టిపర్తి యాదగిరిరావు

అప్పటికి విశ్రాంతి దొరికిన దానిలా రేవతి అక్కడే వున్న సోఫాలో కూర్చొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

మరో ఐదు నిమిషాల్లో సైరన్ ఊదుకుంటూ ఇన్‌స్పెక్టర్ వారి యింట్లో వాలాడు మరో యిద్దరు సార్జంట్స్‌తో సహా.

వారిని వెంటబెట్టుకొని సురేంద్ర గదిలోకి తీసుకెళ్ళింది రేవతి. సురేంద్రతో ఏదో సీరియస్‌గా చర్చిస్తున్న గోపాల్రావు అలికిడి విని వీరి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

గోపాల్రావుని చూస్తూనే "హల్లో డాక్టర్ సాబ్ బావున్నారా ?.... ఈమధ్య క్లినిక్‌లో కనిపించటంలేదు తరుచుగా" పలకరించాడు ఇన్‌స్పెక్టర్ విష్‌చేస్తూ.

"ఆఁ. నథింగ్ డూయింగ్. యిక్కడొక పేషెంట్‌ను చూడటానికి వచ్చాను" రేవతి వంక చిలిపిగా చూస్తూ అన్నాడు గోపాల్రావు.

"ఎమిటీ....? మీరు....మీరు డాక్టర్ ?" నమ్మలేనట్లు చూసింది రేవతి.

అవును. ఆయన సైక్రియాట్రిస్ట్ గోపాల్రావుగారు" జవాబు చెప్తూ అన్నాడు సురేంద్ర.

"ఏమిటీ మిస్టరీ ? నాకేం అర్థంకావడం లేదు. ఆయన మీ యింట్లోనే వుండగా ఆయన ఎవరో మీకు తెలియక పోవడం ఆశ్చర్యంగా వుంది.... యింతకూ దొంగ ఎక్కడ ? అడిగాడు యినస్పెక్టర్ రేవతి వైపుచూస్తూ.

"నేను వివరంగా చెప్తాను వినండి. ఆ తరువాత దొంగ గురించి ఆలోచిద్దాం ;" అంటూ ప్రారభించాడు సురేంద్ర -

"సుమారు ఆరు నెలల క్రితం జంగారెడ్డి గూడెంలో జరిగిన వజ్రాల వ్యాపారి రంగారావు హత్యగురించి మీరు పేపర్లో చదివే ఉంటారు. ఆయన మా పెదనాన్నగారే. ఆయన హత్య జరిగిన సమయంలో రేవతి అక్కడేవుంది. హంతకులు రేవతిని స్తంభానికి కట్టివేసి ఆమె ఎదురుగానే మా పెదనాన్నను హత్యచేశారు. ఆయనను రక్షిద్దామనే వుద్దేశ్యంతో ఎంతో పెనుగులాడింది. కాని ఆయనను రక్షించుకోలేక పోయింది. ఉద్రేకంతో కదిలి పోయిన రేవతి కాళ్ళు చచ్చుబడి పోయాయి. అప్పటినుండి శాశ్వతంగా కాళ్ళు వున్నా అవిటిదై పోయింది. కనీసం చక్రాల బండిలో కూర్చోవడానికి కూడా వీల్లేకపోయింది ఆమె స్థితి.

ఆ తరువాత మా పెదనాన్నను చంపిన దుండగులను పోలీసులు బంధించడం జరిగింది. అదివేరే సంగతనుకోండి, అవిటి

డైపోయిన రేవతిని ఎంతోమంది పేరున్న పెద్ద డాక్టర్లకు చూపించాను అనేక రకాల వైద్యాలు చేయించాను. కానీ ఫలితం కనిపించలేదు. ఇలా వుండగా సుమారు నాలుగు నెలల క్రితం మన ఊరొచ్చిన సైక్రియాట్రిస్ట్ గోపాలరావు గారిని కలుసుకోమని ఎవరో సలహాయిచ్చారు నాకు. నేను ఆయన్ను కలుసుకొని రేవతి విషయం ఆయనకు వివరించాను. ఆయన రేవతి విషయం బాగా ఆలోచించి నా కొక ప్లాన్ చెప్పారు. దాని ప్రకారం ఆయన తాయాకాఫీసులో క్లర్కుగా మా యింట్లో ప్రవేశించారు ఆ తరువాత జరిగిన విషయాలు గోపాలరావుగారు చెప్తారు" సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు సురేంద్ర.

నవ్వుతూ ప్రారంభించాడు గోపాలరావు.

"రేవతి విషయం సురేంద్రగారు నాతో అంతా సవిస్తరంగా చెప్పారు. ఆమెకు కాళ్ళు ఏదైనా ఏక్సిడెంట్ వల్లగాని లేదా ఏదైనా పెద్ద షాక్ వల్ల ఎఫెక్ట్ అ కానీ పోలేదు. కేవలం ఒక హత్య జరిగిన దృశ్యం చూడటం వల్ల పోయాయి. ఆ హత్యా దృశ్యం చూసిన క్షణం నుండి ఆమెకు మానసికంగా తాను నడవలేదు అనే బలమైన నమ్మకం ఏర్పడి పోయింది ఆ బలహీనత పోతే కానీ ఆమె నడవలేదు. అలాంటి వాళ్ళకు ఎన్ని మందులు వాడినా ప్రయోజనం వుండదు కూడా. అందువల్ల ఆమెకు కాళ్ళు రావాలంటే ఒక్కటే మార్గం వుంది. "వజ్రం వజ్రాన భేద్యతే!" అన్నట్లు ఆమెకు కాళ్ళు చచ్చుబడి పోయినప్పుడు కలిగినంతటి ఉద్రేకం మళ్ళీఆమెలో కలిగాలి

నేనొక డాక్టర్నని ఆమెకు వైద్యం చేయడంకోసం వచ్చానని రేవతికి తెలిస్తే ఆమె చాలా అప్సెట్ ఫీలవుతుంది. మా ప్రయత్నమంతా వృథా అవుతుంది. అందుకనే నా విషయం రేవతి వద్ద గోప్యంగా వుంచ మన్నాను.

నేనొక గుమస్తానని చెప్పినా రేవతి నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించింది. అఫ్ కోర్స్.... నేనుకూడా ఆమెను ప్రేమించా ననుకోండి. అదేవిషయం. అంటే నేను రేవతిని తప్పకుండా పెళ్ళి చేసుకుంటానని ఆమెతో చెప్పినప్పుడు ఆమె తనకు తెలియకుండానే నడవగలిగింది. కాని ఆ విషయం నేను వెంటనే గుర్తుచేయడం వల్ల ఆమె మళ్ళా మునుపట్లా అయిపోయింది కదలలేక. నా కప్పుడే ఒక ఆలోచన వచ్చింది. నేను ప్రేమించాననగానే ఆమె అలా నడవ గలిగింది కదా! ఆనందంతో తాను యింత గాఢంగా ప్రేమించిన వ్యక్తి చెడు మార్గంలో కనిపిస్తే ఆమె తప్పకుండా మెంటల్‌గా వర్రీ అవుతుంది. ఆ దుఃఖంలో ఆమె ఏం జేస్తుందో ఆమెకే తెలియదు. అటువంటి పరిస్థితులలో ఆమెకు తప్పకుండా కాళ్ళు వచ్చినా రావచ్చును. అందుకనే ఆమెకు నేనొక దొంగలా కనిపించేటట్లు చిన్న నాటకం ఆడాను. నేను ఊహించిన ప్రకారంగానే రేవతి మళ్ళీ మామూలుగా నడవ గలిగింది. ఇక ముందు కూడా ఆమె అందరి లాగే మామూలుగా నడవొచ్చు."

"క్షమించండి! మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. అవును, మీవల్లనే నేనిప్పుడు బాగా నడవగలుగు తున్నాను" అని, యిన్స్పెక్టర్ వైపుతిరిగి "ఎక్స్‌క్యూజ్ మి!.... అర్ధరాత్రి పూటమీకు శ్రమ యిచ్చాను కాఫీతాగి వెళ్ళురుగాని ఉండండి' అంది రేవతి మందహాసం చేస్తూ.

"నోనో! కాఫీకాదు. త్వరలో డిన్నర్ ఏర్పాటు చేయించండి!" నవ్వుతూ అన్నాడు యిన్స్పెక్టర్.

గోపాలరావు కొంటెగా చూశాడు రేవతి కళ్ళల్లోకి. రేవతిసిగ్గుతో తలవంచుకుంది. ★